

ప్రయివేటు కంపెనీల్లో మహిళలకు ఉద్యోగావకాశాలు

డిఆర్‌డిఎ పీడీ కళ్యాణచక్రవర్తి

ప్రజాశక్తి-రేగిడి

అర్హులైన మహిళలకు ప్రయివేటు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి అన్నారు. మంగళవారం స్థానిక మహిళా సమాఖ్యలో నిర్వహిస్తున్న టైలరింగ్ సెంటర్‌ను పరిశీలించారు. టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు విజయవాడలో ఉన్న టెక్స్‌టైల్స్ కంపెనీలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఎవరైనా సొంతంగా టైలరింగ్ షాప్ పెట్టుకుంటే వారికి కావాల్సిన ఆర్థిక సహాయాన్ని పిఎంఇజిపి ద్వారా అందిస్తామన్నారు. ఆయనతోపాటు ఎపిఎం మంగమ్మ ఉన్నారు.

పరిష్కారం చూపేనా?

- నాన్ షెడ్యూల్ గ్రామాల్లో గిరిజనులకు అందని ఫలాలు
- ఏనుగుల దాడులు పట్టవా?
- సవర భాష సంగతేంటో?
- జంఝావతి, కొఠియా వివాదాలకు పరిష్కారమేది?
- జీడి, మామిడి రైతులకు భరోసా ఎక్కడ?
- పూర్ణపాడు - లాబేసు వంతెనకు ఇంకెన్నాళ్లు?
- డోలీ మోత తప్పేదెప్పటికి?
- జిల్లా కేంద్రంలో మౌలిక సదుపాయాల కొరత తీరేనా?
- నేడు సిఎం జగన్ జిల్లా పర్యటన
- గంపెడు ఆశలతో మన్యం వాసులు



డోలీ సాయంతో రోగిని తీసుకొస్తున్న గిరిజనులు (ఫైల్)

పార్వతీపురం మన్యం జిల్లాలో దీర్ఘకాలికంగా సమస్యలు పేరుకుపోయాయి. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతంగానే ఉండిపోయింది. ప్రత్యేక జిల్లాగా ఆవిర్భవించినప్పటికీ జిల్లా అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి మార్గాలు, సాగునీరు, రహదారులు, వంతెనల అభివృద్ధిలో వెనుకబాటు కొనసాగుతోంది. ముఖ్యంగా నాన్ షెడ్యూల్ గ్రామాల్లో గిరిజనులకు ప్రభుత్వ ఫలాలు అందడం లేదు. ఏనుగులు ఇప్పటి వరకు 17మందిని పొట్టన పెట్టుకున్నా వాటి నుంచి ముప్పు తప్పించేందుకు చర్యలు తీసుకోలేదు. ఈ ప్రాంత సవర భాష ప్రాధాన్యతను ప్రభుత్వం గుర్తించలేదు. ప్రభుత్వాలు మారినా వాలంటీర్ల ఆవేదన అరణ్యరోదనగా మిగిలిపోయింది. జంఝావతి సాగునీటి ప్రాజెక్టుకు ఆటకంగావున్న ఒడిశా వివాదం పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధి చూపలేదు. కొఠియా గ్రామాల వివాదం పరిష్కారానికీ చొరవ లేదు. జీడి, మామిడి రైతులకు మార్కెట్ సదుపాయం, మద్ద ధర కల్పించి భరోసా ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైంది. పూర్ణపాడు - లాబేసు వంతెన నిర్మాణం తమ వల్లే సాధ్యమని చెప్పినా ఆచరణలో విఫలమైంది. తగినన్ని పిహెచ్‌సిలు, సబ్-సెంటర్లు కూడా లేకపోవడంతో నేటికీ డోలీ మోత తప్పడం లేదు. ఈనేపథ్యంలో కురుపాం వేదికగా అమ్మఒడి కార్యక్రమం ప్రారంభానికి వస్తున్న సిఎం జగన్మోహన్‌రెడ్డిపై పార్వతీపురం జిల్లా వాసులు గంపెడాశలతో ఎదురు చూస్తున్నారు.

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం, విజయనగరం ప్రతినిధి

అమ్మఒడి కార్యక్రమం ప్రారంభానికి పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంకు తొలిసారిగా వస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి ఏజెన్సీలో దీర్ఘ కాలిక సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఒడిశా ప్రాంతం లకేరి అడవుల నుంచి వచ్చిన అడవి ఏనుగుల గుంపు 16 ఏళ్లుగా మన్యం వాసుల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పటికే ఏనుగుల దాడిలో 17 మంది మృతిచెందారు. వేలాది ఎకరాల్లో పంటలను నాశనం చేశాయి. ఈనేపథ్యంలో ఎనుగుల నుంచి రక్షణ కల్పించాలని జిల్లా వాసులు గగ్గోలు పెడుతున్నా అతీగతీ లేకుండా పోయింది.

చాలా గిరిజన గ్రామాలు నాన్ షెడ్యూల్డ్ ఏరియాగా గుర్తించక పోవడంతో అక్కడి గిరిజనులు ప్రభుత్వ రాయితీలు, పథకాలు పొందలేక పోతున్నారు. సాలూరు, పాచిపెంట, మక్కువ, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో ఎక్కువ నాన్ షెడ్యూల్ గ్రామాలు ఉన్నాయి.

ఏజెన్సీలోని జీవగెడ్డలపై మినీ రిజర్వాయర్లు, చెక్ డ్యామ్‌లు నిర్మించడం ద్వారా సాగునీటి వనరులను పెంచాలని స్థానికులు దశాబ్దాలు తరబడి కోరుతున్నా ప్రభుత్వాలకు పట్టడం లేదు. దీంతో, నీరు వృథాగా పోతోంది. ముఖ్యంగా గుమ్మిడి గెడ్డపై రిజర్వాయర్ నిర్మిస్తే కురుపాం, జియమ్మవలస, కొమరాడ, గరుగుబిల్లి మండలాల్లో 52గ్రామాల్లో ఉన్న 15వేల ఎకరాలకు సాగు నీరందుతుందని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. సీమలగెడ్డ, వలస బల్లేరు గెడ్డ, డేకురాయి గెడ్డ, పనసభద్ర గెడ్డలపై చెక్ డ్యాములు నిర్మిస్తే వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. జిల్లాలోని వేలాది ఎకరాల్లో జీడి, మామిడి, బీడీఆకు పంటలు పండుతున్నాయి. ఈ పంటలకు మార్కెట్, మద్దతు ధర కల్పించలేకపోతోంది.

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అనారోగ్యం వాటిల్లితే స్థానికంగా వైద్యం అందించే ఎఎన్‌ఎంలు లేక విద్యార్థులు బయటకు వెళ్లాల్సి వస్తుంది. డోలీ మోత తప్పండం లేదు. సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 176 సవర భాష పాఠశాలలు ఉన్నాయి. వారి సంస్కృతి, సాంప్రదాయాలకు అనుగుణమైన భాష ద్వారానే విద్యాబోధన చేయాలని ఏళ్ల తరబడి కోరుతున్నా పట్టించుకోలేదు. గుమ్మ లక్ష్మీపురంలో డైట్ కళాశాల ఏర్పాటుకు ఐటిడిఎ అధికారులు చర్యలు చేపట్టినా పనులు మాత్రం ప్రారంభించలేదు. దీని నిర్మాణానికి రూ.35 లక్షల మంజూరైనా పనులు ప్రారంభించక పోవడంతో వెనక్కి వెళ్లిపోయాయి. ఈ ప్రాంతంలో గిరిజన అభ్యర్థులు ఉపాధ్యాయ శిక్షణకోసం విజయనగరం, విశాఖపట్నం వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. ఆర్థికంగా ఇబ్బందులు తప్పడం లేదు.

కొమరాడ మండలం పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం చేపట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. దీంతో, సుమారు 20 గ్రామాల ప్రజానీకం మండల కేంద్రానికి రావాలంటే సుమారు 30నుంచి 40కిలోమీటర్ల దూరం మేర ప్రయాణం చేయాల్సిన దుస్థితి కొనసాగుతోంది. గిరిజన యువత లో దాగి ఉన్న క్రీడా స్ఫూర్తిని వెలికి తీసేందుకు శిక్షణ కోసం క్రీడా పాఠశాలల ఏర్పాటు ప్రక్రియ నీరుగారింది. సిఎం పర్యటనలో ఈ సమస్య పరిష్కారమౌతాయా? అన్న ఆశతో జనం ఎదురు చూస్తున్నారు.



మన్యంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

రాగుల సాగు రెట్టింపు చేయాలి

చిరుధాన్యాల సాగు, ధాన్యం సేకరణపై అధికారులతో సమీక్షలో మంత్రులు కారుమూరి, బొత్స

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ప్రజల ఆరోగ్యం కోసం చిరుధాన్యాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి కారుమూరి వెంకట నాగేశ్వర్రావు, విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. దీనిలో భాగంగానే రేషన్ డిపోల ద్వారా రాగులు, జొన్నలను పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని చెప్పారు. చిరుధాన్యాలు, ధాన్యం సేకరణపై ఉత్తరాంధ్ర జిల్లాల జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాలు, విజిలెన్స్, తూనికలు కొలతలు, వ్యవసాయ శాఖాధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ముందుగా రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ హనుమంతు అరుణ్‌కుమార్, పౌర సరఫరాల సంస్థ ఎమ్‌డి వీరపాండ్యన్ మాట్లాడుతూ, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాల్సిన అవసరాన్ని, ప్రస్తుత పరిస్థితిని వివరించారు. తమ జిల్లాల్లోని చిరుధాన్యాలు ముఖ్యంగా రాగిపంట సాగు, దాని విస్తరణకు ఉన్న అవకాశాలను జాయింట్ కలెక్టర్లు పిపిటి ద్వారా వివరించారు. పంట విస్తరణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అన్ని జిల్లాల్లో రాగుల సాగును రెట్టింపు చేయాలని అధికారులను మంత్రి కారుమూరి ఆదేశించారు. ప్రభుత్వం రాగులకు రూ.3,480 చొప్పున గిట్టుబాటు ధరను అందిస్తోందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకొని, రాగులను సాగు చేయాలని కోరారు.

మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రస్తుత అవసరాల రీత్యా రాగి సాగును పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రైతు శ్రమకు తగిన గిట్టుబాటు ధరను కల్పించి, పూర్తి సహకారాన్ని అందించినప్పుడే రాగుల సాగు పెరుగుతుందని సూచించారు. ఆ దిశగా అధికారులు యోచన చేసి, రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ విషయంలో వ్యవసాయాధికారులదే కీలక పాత్ర అని అన్నారు. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఎటువంటి సమస్యా ఉత్పన్నం కాకుండా, ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.

జులై నుంచి గోధుమపిండి పంపిణీ

జులై నుంచి రాష్ట్రంలోని అన్ని పట్టణ ప్రాంతాల్లో కిలో రూ.16 చొప్పున ఫోర్టిఫైడ్ చెక్కి గోధుమపిండిని రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేయనున్నట్లు మంత్రి నాగేశ్వర్రావు తెలిపారు. ప్రతీ ధాన్యం మిల్లులో తప్పనిసరిగా డ్రయ్యరు, సిసి కెమేరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీనివల్ల రాష్ట్రస్థాయి నుంచే మిల్లులపై పర్యవేక్షణ చేయవచ్చని అన్నారు. వచ్చే సీజనులో మూడు లేదా నాలుగు రోజుల్లోనే ధాన్యం డబ్బులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గిరిజనులు పండించే చిరుధాన్యాలను సంతల్లో కూడా సేకరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం కందిపప్పు లభ్యత అంతగా లేదని, ఆగస్టు నుంచి దీనిని సరఫరా చేస్తామని మంత్రి ప్రకటించారు. ఎక్కడైనా రేషన్ సరుకులకు అధిక ధరలు వసూలు చేసినా, ఎండియు వాహనదారులు అక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. గోధుమ పిండి పంపిణీని మంత్రులిద్దరూ ఈ సందర్భంగా లాంఛనంగా ప్రారంభించారు. సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ అరుణ్‌కుమార్, పౌర సరఫరాల సంస్థ ఎండి వీరపాండ్యన్, విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జెసి మయూర్ అశోక్, శ్రీకాకుళం, అనకాపల్లి జెసిలు నవీన్‌కుమార్, జాన్వీ పాల్గొన్నారు.



అధికారులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

గ్రానైట్ క్వారీ వద్దు

సర్వేను అడ్డుకున్న తంగుడుబిల్లి వాసులు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

తమ గ్రామంలో గ్రానైట్ క్వారీ వద్దని తంగుడుబిల్లి గ్రామస్తులు సర్వేను అడ్డుకున్నారు. మంగళవారం రెవెన్యూ, మైనింగ్ అధికారులు తంగుడుబిల్లి గ్రామంలోని గ్రానైట్ క్వారీ సర్వే చేపట్టేందుకు వెళ్లగా, వారిని గ్రామస్తులు అడ్డగించారు. గ్రామంలో గ్రానైట్ క్వారీ నిర్వహణకు బడ్డుకొండ మణిదీప్ పేరిట 2021లో దరఖాస్తు వచ్చినట్లు రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. గతంలో ఎటువంటి అనుమతులు లేకుండా గ్రానైట్ క్వారీ దౌర్జన్యంగా తవ్వకాలు చేపడితే అధికారులకు ఫిర్యాదు చేశామని గ్రామస్తులు తెలిపారు. ఇక్కడ అనుమతులు ఇవ్వవద్దని కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. క్వారీకి అనుమతులు ఇస్తే సాగునీటికి ఇబ్బందులు వస్తాయని రైతులు ఆందోళన వ్యక్తంచేశారు.

29న విద్యా సదస్సు

విజయవంతం చేయండి : ఫ్యాప్టో

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలపై ఫ్యాప్టో చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా ఈనెల 29న విజయనగరంలో ఉదయం 9:30 గంటలకు స్థానిక ఎన్జీవో హోమ్‌లో విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫ్యాప్టో జిల్లా చైర్మన్ బి.మహేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ ఎస్.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ విశిష్ట అతిథిగా, ఎపిటిఎఫ్ 257 రాష్ట్ర అధ్యక్షులు భానుమూర్తి ప్రత్యేక అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని ఉపాధ్యాయ ఉద్యోగులందరూ ఈ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సదస్సులో ఉపాధ్యాయ సమస్యలపై చర్చ, భవిష్యత్తు పోరాటాలపై కార్యాచరణ ప్రణాళిక ఉంటుందని తెలిపారు.

సొమ్ము స్వాహాదారులను అరెస్టు చేయాలి

డిఆర్‌డిఎ కార్యాలయం ఎదుట మహిళల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

లక్కవరపుకోట మండలం కల్లేపల్లి గ్రామంలో పొదుపు సంఘాల డబ్బులను స్వాహా చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం డిఆర్‌డిఎ కార్యాలయం ఎదుట వందలాది మంది పొదుపు సంఘాల మహిళలు ఐద్వా ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. తమ సొమ్మును బ్యాంకులకు జమ చేయకుండా స్వాహా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రమణమ్మ మాట్లాడుతూ 48 సంఘాల మహిళలకు లేని అప్పును రుద్దడం, నోటిసులు ఇవ్వడం కరెక్టు కాదన్నారు. 48 పొదుపు సంఘాలకు చెందిన లక్షలు రూపాయిలు డబ్బులు స్వాహా కు కారణమైన బ్యాంక్ మేనేజర్ , సిసి ఈశ్వరావును ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. జైలులో ఉన్న గాడి చినతల్లిపై క్రిమినల్ కేసు పెట్టి, 420 కేసు నమోదు చేయాలన్నారు. స్త్రీ నిధి డబ్బులు ఒక గ్రూపునకు రూ. 2లక్షల 50 వేలు ఇచ్చినట్లు చూపిస్తున్నారని, కానీ లక్ష మాత్రమే ఇచ్చారని, మిగతా డబ్బులు ఏమయ్యాయని ప్రశ్నించారు. దీనిపై పరిశీలించి ఆయా గ్రూపులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. హత్యకు గురైన గోకాడ మహేశ్వరి కుటుంబానికి న్యాయం చేసే విధంగా వారి ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, వాళ్ళ పిల్లల విద్య, వైద్యం భాధ్యతలు ప్రభుత్వం భరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎపిడి ధర్నా వద్దకు వచ్చి సమస్యను అడిగి తెలుసుకున్నారు. విచారణ జరుగుతోందని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారం రోజుల్లో సమస్య పరిష్కారం చేసి, అవినీతికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయకుంటే ఉద్యమం మరింత ఉధతం చేస్తామని ఐద్వా నాయకులు హెచ్చరించారు. ధర్నాలో ఐద్వా సహాయ కార్యదర్శులు జి. పుణ్యవతి, వి.లక్ష్మి, సహాధ్యక్షులు అర్.హరి కృష్ణ వేణి, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణవేణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.అప్పారావు పాల్గొన్నారు.



డిఆర్‌డిఎ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఐద్వా నాయకులు, మహిళలు

ఎండిఎం కార్మికుల వినతి

ప్రజాశక్తి-రాజాం

మధ్యాహ్న భోజనం పథకంలో మెనూ ఛార్జీలు పెంచి, వంట గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని ఎంఇఒకు ఎండిఎం కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణవేణి, హైమావతి మంగళవారం వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 ఏళ్లుగా కనీస వేతనాలు అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెట్టిచాకిరీ చేయించు కుంటున్నాయని తెలిపారు. సామాజిక భద్రత పెన్షన్లు లేవన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని కోరారు.

హత్య కేసులో నిందితురాలికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-విజయనగరం లీగల్, కొత్తవలస

కొత్తవలస పోలీసు స్టేషన్ పరిధి తుమ్మికాపల్లిలో 2019లో జరిగిన హత్య ఘటనలో నిందితురాలు అడ్డూరి విజయలక్ష్మికి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ విజయనగరం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ కోర్టు జడ్జి బి.కళ్యాణ్ చక్రవర్తి మంగళవారం తీర్పు వెల్లడించారు. ఈమేరకు కొత్తవలస సిఐ ఎస్.బాల సూర్యారావు తెలిపారు. తుమ్మికాపల్లికి చెందిన అడ్డూరి విజయలక్ష్మి (35) తన భర్త అడ్డూరి దేవుడు తరచూ ఆమెను అనుమానించి, మానసికంగా వేధిస్తున్నాడని అతడిని హత్య చేసింది. ఈ విషయమై కొత్తవలస పోలీసు స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ మురళి కేసు నమోదు చేయగా, సిఐ జి.గోవిందరావు దర్యాప్తు చేపట్టి, నిందితురాలిని అరెస్టు చేసి, కోర్టులో అభియోగ పత్రాలను దాఖలు చేసారు. కోర్టు విచారణలో నిందితురాలు అడ్డూరి విజయలక్ష్మి పై నేరారోపణలు రుజువు కావడంతో నిందితురాలికి జీవిత ఖైదు, రూ.వెయ్యి రూపాయలు జరిమానా విధించారు.

జులై 10,11 తేదీల్లో

ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

కలెక్టరేట్ వద్ద 36 గంటల ధర్నా



నిరవధిక ధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అంగన్వాడీ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జులై 10,11 తేదీల్లో కలెక్టరేట్ వద్ద 36గంటల నిరవధిక ధర్నా చేపడుతున్నట్లు ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, జిల్లా నగర అధ్యక్ష కార్యదర్శులు ఎ.జగన్మోహన్‌రావు, బి.రమణ తెలిపారు. మంగళవారం జరిగిన సెక్టార్ సమావేశంలో వారు మాట్లాడారు. రోజురోజుకూ ధరలు పెరుగుతున్నా మెనూ ఛార్జీలు మాత్రం పెరగడం లేదన్నారు. పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు చేతి డబ్బులు పెట్టి వంట చేయాల్సి వస్తుంన్నారు. నెలకు గ్యాస్ బండ ఇస్తామని ప్రభుత్వం చెప్పిన ఆచరణలో అమలు చేయలేదన్నారు. కర్ణాటకలో అంగన్వాడీ టీచర్లకు గ్రాట్యుటీ అమలు చేస్తున్నారని, తెలంగాణలో మనకంటే ఎక్కువ జీతాలు ఇస్తున్నారని తెలిపారు. మన రాష్ట్రంలో మాత్రం జీతాలు పెంచకపోగా కొత్త కొత్త యాప్‌లతో పని భారం పెంచుతున్నారని, వర్కర్లపై వేధింపులు పెరిగాయని తెలిపారు. ఈ దుస్థితి మారాలంటే ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గ్రాట్యుటీ అమలు, కనీస వేతనం రూ.26వేలు, పెన్షన్, అర్హులు అందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా జులై 10, 11 తేదీల్లో కలెక్టరేట్ల వద్ద జరిగే 36 గంటల ధర్నాలో అంగన్‌వాడీలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సెక్టార్ లీడర్లు ప్రభ, ప్రసన్న, లలిత, శివలక్ష్మి, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం : జూలై 10 11వ తేదీల్లో జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద 36 గంటల ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఆ సంఘం సెక్టారు నాయకులు జి.సన్యాసమ్మ, కొండమ్మ ఆధ్వర్యాన కరపత్రం విడుదల చేశారు. ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటూ కొత్త కొత్త యాప్‌లు తెచ్చి పని భారాన్ని పెంచిందని అన్నారు. ఈనేపథ్యంలో తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

రాజాం : అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి జులై 10, 11 తేదీల్లో కలెక్టరేట్ చేపట్టే 36 గంటల ఆందోళనను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్.రామ్మూర్తినాయుడు కోరారు. రాజాం మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్, ఇఎస్ఐ, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ వంటివి ఏవీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఉమాకుమారి, మంగమ్మ, పుణ్యవతి, లక్ష్మీనారాయణ, పార్వతి, జయలక్ష్మి, కాశీరత్నం, సత్యవతి, హైమావతి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.



కెజిబివి సిబ్బందితో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష పీడీ శ్రీనివాసరావు

కెజిబివిలో ఆకస్మిక తనిఖీలు

ఉత్తీర్ణతపై సమగ్ర శిక్ష పీడీ అసంతృప్తి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

స్థానిక కెజిబివిలో సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కెజిబివిలో పదో తరగతి ఉత్తీర్ణతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో వారి బాగోగులు, చదువు, భోజనం తదితర అంశాలపై ఆరాతీశారు. అనంతరం సిఆర్‌టిలతో సమావేశమయ్యారు. పదో తరగతిలో కొంతమంది విద్యార్థులు తప్పిపోవడానికి గల కారణాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భోజనం, చదువు విషయంలో రాజీపడనని చెప్పారు. ఇటీవల మెంటాడ కెజిబివి ప్రిన్సిపల్‌ను ఎందుకు సస్పెండ్ చేశామో తెలుసుకదా? అన్నారు. పిల్లలకు సరైన వెలుతురు లేని గదుల్లో చదువు చెప్పడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. నాడు-నేడు పనులు జులై నెలాఖరుకల్లా పూర్తి చేసి, గదులు వినియోగంలోకి తేవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాలలో సమస్యలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిఇఒ లింగేశ్వరరెడ్డి, ఎంఇఒ పాపినాయుడు, కెజిబివి ఎస్ఒ ఎ.భారతి, తదితరులు పాల్గొన్నారు.

రేపు పలు గ్రామాలకు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యుత్తు సబ్ స్టేషన్ మెయింటెనెన్సు పనుల కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విజయనగరం మండలంలోని పలు గ్రామాలకు గురువారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. అయ్యన్నపేట, అయ్యన్నపేట జంక్షన్, పాల్ నగర్, దుప్పాడ, చిల్లపేట, జొన్నవలస, రాకోడు, పినవేమలి, సారిక, కోరుకొండ, కోరుకొండ పాలెం, కోరుకొండ కొత్తూరు, అట్టాడ, దత్తరాజ్ గార్డెన్, గుంకలాం, గుంకలాం జగనన్న కాలనీ, నందాం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

జెవికె అమలు పరిశీలన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ తీరును జిల్లా పరిశీలకులు కల్పన మంగళవారం పరిశీలించారు. పంపిణీ చేసిన కిట్లు, బయోమెట్రిక్ గురించి విద్యాశాఖ అధికారులను అడిగి ఆమె తెలుసుకున్నారు. అనంతరం శృంగవరపుకోట - 1 ప్రాథమిక పాఠశాలను, ఎంఆర్‌సిలో స్టాక్ పాయింట్‌ను ఆకస్మాత్తుగా సందర్శించారు. కార్యక్రమంలో సిఎంఒ వర్రి ఆదినారాయణ, ఎంఇఒలు పెంట సత్యనారాయణ, పాదం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎంఆర్‌సి అధికారులతో మాట్లాడుతున్న జిల్లా పరిశీలకులు కల్పన

నేర ప్రవృత్తి వీడండి

విజయనగరం : నగరంలోని 1వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో నివసిస్తున్న రౌడీ షీట్ కలిగిన వ్యక్తులను మంగళవారం స్టేషనుకు పిలిచి డిఎస్‌పి ఆర్.గోవిందరావు కౌన్సిలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తి విడనాడాలని లేకుంటే కఠిన చర్యలు తప్పవని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు అశోక్ కుమార్ , రామగణేష్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'నారాయణ'పై చర్యలు తీసుకోవాలి

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్

ప్రభుత్వ నిబంధనలు గాలికి వదిలి యథేచ్ఛగా, విచ్చలవిడిగా ఫీజులు పెంచుకుంటూ నిర్వహిస్తున్న నారాయణ పాఠశాలపై విద్యాశాఖ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం స్థానిక నారాయణ పాఠశాలను ఎస్‌ఎఫ్‌ఐ కమిటీ సందర్శించి విద్యార్థుల ఫీజుల వివరాలపై సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పి.రాజశేఖర్ మాట్లాడుతూ నారాయణ పాఠశాలలో ఫీజుల దోపిడీ ఎక్కువగా ఉందని 1 నుంచి 5వ తరగతి వరకు రూ.30వేలు, ఆరో తరగతి నుండి పదో తరగతి వరకు రూ.50వేలు వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. అంతేకాక ప్రత్యేక తరగతుల పేర్లతో అదనంగా మరికొంత వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని, పుస్తకాలు, యూనిఫాం, బూట్లు కూడా పాఠశాలలోనే కొనాలనే నిబంధనతో వేలకు వేలు దోచుకుంటున్నారని, ఇది దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారంగా విద్యార్థుల ఫీజుల వివరాలు నోటీసు బోర్డుల్లో పెట్టాలని, పుస్తకాలు అమ్మరాదని, 20 శాతం పేద విద్యార్థులకు ఎటువంటి ఫీజులు కట్టించుకోకుండా ఉచిత విద్యను అందించాలనే నిబంధనలున్నప్పటికీ నారాయణ పాఠశాలలో ఏవీ అమలులో లేవని తెలిపారు. కావున, వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి నారాయణ విద్యాసంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ సింహాచలం, కె.భాస్కర్, నవీన్, వంశీ పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో 3500 ఎకరాల్లో పంట నష్టం

ప్రజాశక్తి - కురుపాం

ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతంలో ఇప్పటి వరకు 3500 ఎకరాల పంట నష్టం జరిగిందని, పంట నష్టం జరిగిన రైతులకు రూ.2 కోట్ల 8 లక్షలు అందజేశామని ఎలిఫెంట్ మానిటరింగ్ ఫారెస్ట్ రేంజ్ అధికారి కె.మణికంఠేష్ అన్నారు. స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 2017 నుంచి భామిని మండలంలో 4 ఏనుగుల గుంపు, 2018లో కురుపాం నియోజకవర్గంలో 10 ఏనుగుల గుంపు తిరుగుతున్నాయని ఇంతవరకు 10 మంది ఏనుగుల బారినపడి మృతి చెందారని తెలిపారు. వీరి కుటుంబ సభ్యులకు రూ.2,50,000 చెక్కు, మరో రూ.2,50,000 కుటుంబ సభ్యుల పేరున డిపాజిట్ చేశామన్నారు. మృతి చెందిన ఒక్కొక్క కుటుంబానికి రూ.5లక్షలు చొప్పున నష్టపరిహారం అందజేశారు. ఇంకా పంట నష్టం రూ.28 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. కురుపాం నియోజకవర్గంలో 15 మంది, భామిని మండలంలో ఏడుగురు సిబ్బందితో ఏనుగుల కదలికలు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ అప్రమత్తం చేస్తూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని అన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఐ రాజేష్, గ్రామస్తులు

మత్తు పదార్థాలపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-వేపాడ

మండల కేంద్రంలో మంగళవారం ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యాన మత్తు పదార్థాలపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత ఎలా పెడదారి పడుతున్నారో వివరించారు. వాటివల్ల కలిగే నష్టాలను వివరించి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని యువతను కోరారు. ర్యాలీలో స్టేషన్ సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

ఎన్ఆర్‌సిలో డిఐఒ తనిఖీ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

స్థానిక జిల్లా కేంద్రాసుపత్రిలో గల ఎన్ఆర్‌సిని (పోషకాహార పునరావాస కేంద్రం) జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు మంగళవారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన బరువు తక్కువగా ఉన్న, పోషకాహార లోపం పిల్లల ఆరోగ్యాన్ని పరిశీలించారు. అలాగే వారి తల్లులతో మాట్లాడి అందుతున్న సేవలనుఅడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ ఈ విధంగా ఆరోగ్య స్థితిని పరిశీలించి సంబంధిత గ్రోత్ చార్ట్‌లో నమోదు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. చిన్నారులకు అందజేస్తున్న పోషకాహార మెనూ, సిరప్‌లను పరిశీలించారు. ప్రతి నెలా అడ్మిట్ అవుతున్న పిల్లల ఆరోగ్య వివరాల రికార్డులను ఆయన పరిశీలించి, ఆరోగ్య స్థితి మెరుగుపడే వరకూ పక్కగా వైద్య సేవలందించాలన్నారు. ఆయన వెంట సూపర్ వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఎల్‌సిడిసి సర్వే

ప్రజాశక్తి-కొత్తవలస

లెప్రసీ కేస్ డిసైటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సిడిసి) సర్వే చేపట్టాలని వియ్యంపేట పిహెచ్‌సి వైద్యులు గోపాలకృష్ణ.. సిబ్బందికి సూచించారు. ఈ మేరకు సర్వేకు సంబంధించిన పోస్టర్లు, పిన్‌కార్డులను ఆయన మంగళవారం విడుదల చేశారు. ఒక్కో బృందం రోజుకు 20 ఇళ్లను సర్వే చేసి, అవగాహన కల్పించాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు సింహాద్రినాయుడు, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, పిహెచ్ ఎన్.జగదాంబ, ఇఒ తిరుపతిరావు, హెచ్‌వి పద్మావతి, ఫార్మసిస్ట్ ఆశాజ్యోతి, ఎల్‌టి సంతోష్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని గొల్లపల్లి, రత్నాలనగర్, అమ్మిగారికోనేరుగట్టు, పాతడంపింగ్ యార్డు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను కమిషనర్ శ్రీనివాసరావు పరిశీలించారు. ప్రతిరోజూ కాలువలను శుభ్రం చేయాలని, ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని శానిటేషన్ కార్మికులను ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు.

నెల్లిమర్ల ఎంఇఒగా విజయకుమారి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నెల్లిమర్ల ఎంఇఒగా బి.విజయకుమారి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్న బి.విజయకుమారి.. ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన విధానం ప్రకారం ఎంఇఒగా ఉద్యోగోన్నతి లభించింది.

భూముల రీసర్వే పరిశీలన

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

మండలంలోని వెంకటరాయుడుపేట గ్రామంలో చేపడుతున్న భూముల రీసర్వేను మంగళవారం తహశీల్దార్ రాజేశ్వరరావు పరిశీలించారు. సర్వే బృందం తప్పకుండా రైతుల సమక్షంలోనే వారి పొలాల కొలతలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ అప్పయ్య, విఆర్ఒ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి-వేపాడ

డబ్బిరాజుపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆ స్కూల్ హెచ్‌ఎం శంకరరావు కుమార్తె ప్రియాంక సమకూర్చిన పుస్తకాలను మంగళవారం ఎంఇఒ బాలభాస్కరరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్, ఎంపిటిసి పాల్గొన్నారు.

నేటి నుంచి మరిడిమాంబ పండగ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో వావిలపాడులో మరిడిమాంబ గ్రామదేవత ఉత్సవాలను బుధ, గురువారాల్లో నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ బీల రాజేశ్వరి తెలిపారు. బుధవారము తొలేళ్ల ఉత్సవం, గురువారం అనుపోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ఎడ్ల పరుగు పోటీలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

29న వాహనాల వేలం

సీతానగరం : వివిధ కేసుల్లో నమోదైన పాత నేరాల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలు, కారును ఈ నెల 29న వేలం పాట నిర్వహించనున్నట్లు ఎస్ఐబి ఇన్‌స్పెక్టర్ పి.దుర్గాప్రసాద్, ఎస్ఐ ఎ.శ్రావణ్ కుమార్ తెలిపారు.

జగనన్న సురక్షలో వెంటనే ధ్రువపత్రాలు

ఆర్‌డిఒ శేషశైలజ


సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌డిఒ శేషశైలజ

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసిన వెంటనే అక్కడికక్కడే ధ్రువపత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ శేషశైలజ అధికారులను ఆదేశించారు. మంగళవారం కోమటిపల్లి సచివాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం అమలు బాధ్యత ప్రతి ఉద్యోగిపైనా ఉందన్నారు. గ్రామ వాలంటీరు తనకు కేటాయించిన 50 ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం తక్షణం మంజూరు చేస్తున్న 11 రకాల ధ్రువపత్రాలు అందించేందుకు సిద్ధం కావాలన్నారు. వారి అవసరాలను తెలుసుకొని తక్షణం రిజిస్ట్రేషన్ చేయించాలని ఆదేశించారు. ఈ 11 రకాల సర్వీసులు ప్రతి లబ్దిదారునికి చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజేశ్వరరావు. విఆర్ఒ పూడి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మండల కార్యాలయం వద్ద ఎంపిపి శంబంగి లక్ష్మి సర్పంచులు, ఎంపిటిసిలతో సమావేశం నిర్వహించారు. ప్రతి అర్జీదారునికి ధ్రువపత్రాలు అందించే బాధ్యత ప్రజాప్రతినిధులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, జెడ్‌పిటిసి శాంతికుమారి, ఎంపిడిఒ రవికుమార్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల : జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు అన్నారు. మంగళవారం జరజాపుపేట 20 వార్డులో జగనన్న సురక్ష అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా 11 ధ్రువపత్రాలు అందిస్తున్నట్లు చెప్పారు.

బొబ్బిలి : జగనన్న సురక్ష సర్వే ఇంటింటికి వెళ్లి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. రావువారివీధి సచివాలయం పరిధిలో జగన్న సురక్ష పని విధానాన్ని పరిశీలించి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష సర్వే ఇంటింటికి వెళ్లి చేసి 11 రకాల సేవలను ప్రజలకు అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేపాడ : మండలంలో వీలుపర్తి సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై జెసిఎస్ ఇన్‌ఛార్జి బి.శ్రీను అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట అప్పారావు, ఎంఎల్ఒ అవతారం పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో మెరుగైన సేవలు

డిసిహెచ్ఎస్ గౌరీ శంకర్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

శృంగవరపుకోట ఏరియా ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు డిసిహెచ్ఎస్ గౌరీశంకర్ తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ నీలతో కలిసి ఆయన ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రస్తుతం 70 ఐపి ఉందన్నారు. ఆరోగ్యశ్రీ వార్డులో 48 కేసులు ఉన్నాయని చెప్పారు. పిడియాట్రిక్స్, గైనకాలజీ, ఆర్థోపెటిక్స్, జనరల్ సర్జరీ, తదితర జిల్లాలోనే సీనియార్టీ గల వైద్యులు ఈ ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. బ్లడ్ బ్యాంక్ కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 50 పడకలుగా ఉన్న ఈ ఆస్పత్రి రూ.20 కోట్లతో 100 పడకలుగా రూపుదిద్దుకుంటుందని చెప్పారు. ఆసుపత్రి ప్రారంభోత్సవ తేదీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

అనంతరం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్య సేవలను మెరుగుపరిచేందుకు కావలసిన పరికరాల కోసం ఆసుపత్రి అభివృద్ధి కమిటీతో చర్చించి అన్ని ఏర్పాట్లను చేస్తామని తెలిపారు. అనంతరం 108 వాహన సిబ్బంది ఆసుపత్రిలో వారికి ప్రత్యేక గది కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతి అందించారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిసిహెచ్ఎస్ గౌరీ శంకర్


ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

సిఎం సభా వేదిక పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

ముఖ్యమంత్రి కురుపాం పర్యటన ఏర్పాట్ల పరిశీల నిమిత్తం మంగళవారం కురుపాం విచ్చేసిన రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గిరిజన ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణ పనులను మొదటగా పరిశీలించి పనులు జరుగుతున్న నేపథ్యంలో ఇంజనీరింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకుని కళాశాల నిర్మాణ నమూనాలు పరిశీలించి అనంతరం సిఎం సభా వేదికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు మొట్టమొదటి సారిగా ముఖ్యమంత్రిగా వచ్చి జగనన్న అమ్మఒడి కార్యక్రమం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. తల్లి బాగుంటే పిల్లలు బాగుంటారని, పిల్లలు చదవాలంటే తల్లికి కొంత ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రి ఆశయం గొప్పదని అన్నారు.

జగనన్న అమ్మఒడి కార్యక్రమం కింద ఆర్థిక సహాయం అందించడం పిల్లల చదువుకు భరోసా ఇవ్వడం గర్వించదగ్గ విషయమన్నారు. సభా ఏర్పాట్లపై కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజ్, ఎమ్మెల్సీలు తలశీల రఘురాం, పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు పాముల పుష్ప శ్రీవాణి, అలజంగి జోగారావు, కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, టిడ్కో చైర్మన్ జమ్మానప్రసన్న కుమార్, జిల్లా అధికారులు, మండలాధికారులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిని సందర్శించిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-వేపాడ

బొద్దాం పిహెచ్‌సిని డిఎంహెచ్ఒ భాస్కరరావు మంగళవారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ పనితీరుపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. సమయపాలన పాటిస్తూ సక్రమంగా సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ సూర్యనారాయణ, వైద్యులు సతీష్‌కుమార్, రమాదేవి పాల్గొన్నారు.


ఆన్‌లైన్‌లో డేటాను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు




మున్సిపల్ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు, జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు

మున్సిపల్ కార్మికుల క్రమబద్ధీకరణకు పోరుబాట

సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల క్రమబద్ధీకరణ కోసం పోరుబాటకు సిద్ధంగా ఉండాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు కోరారు. మంగళవారం నిర్వహించిన మున్సిపల్ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్మోహన్ రెడ్డి మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను అధికారంలోకి రాగానే పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చి, నేటికీ నెరవేర్చకుండా ద్రోహం చేస్తున్నారని ధ్వజమెత్తారు. బుధవారం జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో సమావేశాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. జులై 20న మున్సిపల్ కార్యాలయాల ముట్టడి, 28, 29 రిలే నిరాహార దీక్షలు, ఆగస్టు 17 చలో విజయవాడ కార్యక్రమానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షులు జి.గౌరి, బి.యుగంధర్, జె.రామారావు, బి.వెంకటి, జి.శంకరరావు పాల్గొన్నారు.

రాజాం : మున్సిపల్ కార్మికుల సమస్యలపై దశల వారి పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తి నాయుడు కోరారు. మంగళవారం నిర్వహించిన రాజాం మున్సిపల్ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు వినతి అందించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేష్, చిన్నబాబు, కృష్ణ, శంకర్రావు, కనకరాజు, సింహాచలం, అనిల్‌కుమార్, శ్రీనివాసరావు, రవి, శోభన్‌బాబు, లక్ష్మి పాల్గొన్నారు.


విత్తనాలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

రైతులకు విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని లచ్చింపేట రైతు భరోసా కేంద్రం వద్ద ఎఒ స్వాతి ఆధ్వర్యంలో ఎంపిపి గేదెల శ్రీనివాసరావు వరి విత్తనాలను సబ్సిడీపై రైతులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మండలానికి స్వర్ణ 280 క్వింటాళ్లు, 1121 రకం 1340 క్వింటాళ్లు , సాంబ 200 , సోనామసూరి 150 , 1221 రకం 25, 1064 రకం 3 , నెల్లూరు సన్నాలు 4 క్వింటాళ్ల చొప్పున వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామారావు, ఎంపిటిసిలు బి.స్వామినాయుడు, యడ్ల కిషోర్ కుమార్, గోకాడ ముసలినాయుడు, బొడ్డు గణపతి, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కరాటే పోటీలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు

తైక్వాండో పోటీల్లో

కొత్తవలస క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి-కొత్తవలస

విజయనగరంలో జరిగిన తైక్వాండో పోటీలో కొత్తవలసకు చెందిన ఎం.చాందిని, ఎన్. లలితా కామేశ్వరి, ఎన్.కుసుమ, ఎన్.షణ్ముఖ ప్రియ, కె.పునీత, వి.జ్ఞానేంద్ర పతకాలు సాధించారు. వీరిని విజయనగరం డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, డిఎస్‌డిఒ రామగోపాల్ అభినందించారు. జులై 1, 2 తేదీల్లో తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని కోచ్‌లు డి.వి.చారి ప్రసాద్, ఎం.త్రినాథరావు తెలిపారు.

ప్రతీ కుటుంబ సంతోషమే లక్ష్యం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రతీ కుటుంబ సంతోషమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని సచివాలయం-3 పరిధిలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా వర్తించిన పథకాల ప్రయోజనాలు, ప్రభుత్వ విధానాలు, ప్రస్తుత ప్రభుత్వ పాలన వ్యత్యాసాలు వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తెలుసుకొని అక్కడికి అక్కడే సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, పట్టణ అధ్యక్షులు షేక్ రెహమాన్, ఖాన్, పోతనపల్లి వెంకటరావు, జెసిఎస్ ఇన్‌ఛార్జి వాకాడ సతీష్, తదితరులు పాల్గొన్నారు.


గంట్యాడ.. గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

బుడతనాపల్లిలో గడపగడపకు..

గంట్యాడ : మండలంలోని బుడతనాపల్లి గ్రామంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ఆధ్వర్యాన మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి ఆరాతీశారు. రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఆయన్ను కోరారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి, సంబంధిత అధికారులు పిలిపించి, అక్కడికక్కడ అంచనా వేయించారు. కాలువలు, రోడ్ల నిర్మాణానికి తక్షణమే నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి వి.నరసింహమూర్తి, ఎంపిపి పీరుబండి హైమావతి, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు పి.జైహింద్ కుమార్, సర్పంచ్ అలమండ వాణి, ఎంపిటిసి వర్రి అర్జునమ్మ, ఎంపిడిఒ భానోజీరావు, వైసిపి నాయకులు రామునాయుడు, టిడి ప్రసాద్, వర్రి మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో పాతబొబ్బిలి, మల్లమ్మపేట, తారకరామకాలనీ, నాయుడుకాలనీలో అభివృద్ధి పనులకు మంగళవారం చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో కాలువలు, రోడ్లు, కల్వర్టులు నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సిహెచ్ రమేష్‌నాయుడు, కె.రామారావు, టి.పార్వతమ్మ, వైసిపి నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణ

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన అల్లు రామకష్ణ గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం రాత్రి తమ కల్లంలో గడ్డిమందు తాగిన ఆయనను కుటుంబ సభ్యులు గమనించి ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమచికిత్స అనంతరం విశాఖ కెజిహెచ్‌కు వైద్యులు తరలించారు. చికిత్స అందించినా ఫలితం లేకపోవడంతో రామకృష్ణ మృతి చెందాడు. రామకృష్ణ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబ సభ్యులను పోషిస్తున్నాడు. ఈ ఏడాది జనవరిలో ఆయన తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రామకృష్ణ ఆత్మహత్యకు అప్పులే కారణం కావచ్చునని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. ఎస్ఐ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలో కొట్టక్కి జాతీయరహదారిపై పెట్రోల్ బంక్ సమీపంలో మంగళవారం తెల్లవారు జామున సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. తలపైనుంచి లారీ వెళ్లడంతో నుజ్జునుజ్జయింది. గుర్తుపట్టలేని విధంగా ఉంది. వయస్సు 50 ఏళ్లకు పైబడి ఉంటాయని, నలుపురంగు చొక్కా, తెల్లషర్టు ధరించాడని ఎస్ఐ సురేంద్రనాయుడు తెలిపారు. మృతదేహాన్ని బాడంగి సిహెచ్‌సికి తరలించారు.